క్లుప్తంగా

బోడెం రాంబాబు సేవలు అభినందనీయం

రంగంపేట: బీజేపీ వెంకటాపురం గ్రామశాఖ అధ్యక్షుడు బోడెం రాంబాబు సేవలు అభినందనీయమని మదర్ థెరిస్సా సేవా సమితి వ్యవస్థాపకుడు ఉందుర్తి సుబ్బారావు అన్నారు. రంగంపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) డైరెక్టర్‌గా రాంబాబు నియమితులైన సందర్భంగా వెంకటాపురంలో మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. కార్యక్రమంలో నీటి సంఘం డైరెక్టర్ బోడెం రామచంద్రరావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎం.చిన్నప్పారావు పి.రాజేశ్వరరావు, సీహెచ్ సత్యనారాయణ దొర, ఎస్.గంగాధర్ పాల్గొన్నారు.

మైనింగ్ అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు



కొండగుంటూరులో గ్రావెల్ తవ్వకాలను తనిఖీ చేస్తున్న అధికారులు

రాజానగరం: మైనింగ్ అక్రమ తవ్వకాల నిరోధంలో భాగంగా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, ఎవరైనా అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కొండగుంటూరులో జరుగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లడంతో శనివారం ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రావెల్ రవాణాకు ఉపయోగిస్తున్న ఒక పొక్లెయిన్, రెండు టిప్పర్లు, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని సీజ్ చేయాలని రాజమహేంద్రవరం ఆర్డీఓకు రిపోర్టు చేశామన్నారు. తనిఖీలో ఏపీ ట్రాన్స్‌కో, రెవెన్యూ అధికారులు జ్యోతిర్మయి, శ్రీనివాస్, జీవీ సత్యనారాయణ, ఎస్.వెంకటేశ్వరరావు, జె.అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ఆటోను ఢీకొన్న కారు

ఆటో డ్రైవర్‌తో పాటు పది మందికి గాయాలు



ఆటోను పరిశీలిస్తున్న పోలీసు అధికారి

రాజానగరం: జాతీయ రహదారిపై బ్రిడ్జి కౌంటీ ఎదురుగా శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు పది మంది స్కూల్ విద్యార్థులు గాయపడ్డారు. దివాన్ చెరువు వైపు నుంచి స్కూల్ విద్యార్థులతో వస్తున్న ఆటో చక్రద్వారబంధం వెళ్లేందుకు బ్రిడ్జి కౌంటీ వద్ద యూటర్న్ తీసుకుంటోంది. అదే సమయంలో జీఎస్ఎల్ వైద్య కళాశాల నుంచి వస్తున్న కారు..ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కుక్కల శ్రీనుతో పాటు దానిలో ఉన్న పది మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానిక సీఐ వీరయ్య గౌడ్ తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని రక్షక్ వాహనంలో జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ ఆదాయానికి నష్టం

అనపర్తి: కొప్పవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కొప్పవరం నుంచి లక్ష్మీనరసాపురం రోడ్డుకు ఇరువైపులా ఉపాధి హామీ పథకంలో పెంచుతున్న కొబ్బరి చెట్ల కాయలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. దీని వల్ల పంచాయతీ ఆదాయానికి నష్టం కలిగిందని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ పంచాయతీ కార్యదర్శి నంద బుల్లబ్బాయి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు 450 కొబ్బరి చెట్లకు గాను దాదాపు వంద చెట్ల నుంచి గత రెండు నెలలుగా నుండి ఫలసాయం వస్తోందన్నారు. వాటిని గుర్తు తెలియని వ్యక్తులు ఎప్పటికప్పుడు తీసుకుపోతున్నారన్నారు. దీంతో ఆ కొబ్బరి కాయల వేలం పాట పాడుకోవడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదన్నారు.

స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలు నాటాలి

పెదపూడి: స్వచ్ఛమైన గాలి కోసం అందరూ విరివిగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛమైన గాలి అనే అంశంపై పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ చేశారు. విద్యార్థులకు 5 కేవీ సోలార్ ప్యానల్ బోర్డులను చూపించి, వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మేడపాటి సత్యనారాయణరెడ్డి, ఎంఈఓ-1 సీవీవీ సత్యనారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.ఉషారాణి, పీఈటీ మురళీ పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

- కూటమి ప్రభుత్వ తీరు దారుణం
- సాక్షి, ఎడిటర్, రిపోర్టర్లపై వేధింపులు తగవు
- వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు



బిక్కవోలులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

బిక్కవోలు: పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విలేకరులు కోరారు. ఈ మేరకు మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికలు అనేవి ప్రజాపక్షమని, వృత్తి నిబద్ధతను పాటిస్తున్న సాక్షి పత్రికపై



కూటమి ప్రభుత్వం కక్ష కట్టడం దారుణమన్నారు. వార్తలు సహేతుకంగా లేవని భావించినప్పుడు వివిధ వేదికల ద్వారా వాటిని ఖండించాలే తప్ప ఇలా వేధించడం సరికాదన్నారు. అక్రమ కేసుల ద్వారా వేధింపులకు దిగడమంటే భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాయడమేనన్నారు. రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన నకిలీ మద్యం మాఫియాపై సాక్షి పత్రికలో వార్తలు రావడంతో ఎడిటర్ ధనంజయ రెడ్డికి నోటీసులు జారీ చేసి, పదే పదే విచారణ పేరుతో బెదిరింపులకు దిగడం సరికాదని హితవు పలికారు. వినతిపత్రం అందించిన గొర్రిపోటి హేమ సురేష్, జి.వీరభద్రరావు, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

కాలుష్య రహిత దీపావళి చేసుకుందాం



బిక్కవోలులో ర్యాలీ చేస్తున్న అధికారులు

బిక్కవోలు: కాలుష్య రహిత దీపావళి పండగ చేసుకుందామని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి స్థానిక కెనాల్ రోడ్డు వరకూ శ్రీ ప్రజ్ఞ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలోని పరిపాలనా అధికారి నాగేంద్ర ప్రసాద్, తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ, ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హరిత దీపావళిపై ర్యాలీ

సీతానగరం: హరిత దీపావళిపై రఘుదేవపురం పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ఆ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్సై డి.రామ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా హరిత దీపావళి ప్రాముఖ్యతను వివరించారు. రఘుదేవపురం సెంటర్‌లో విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది, పోలీసు అధికారులు, స్థానికులు మానవహారంగా ఏర్పడ్డారు. మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సిబ్బందికి అందజేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.శ్యామలాదేవి, సర్పంచ్ చంద్రలీల, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాటవరంలో గ్రామసభ

సీతానగరం: మండలంలోని కాటవరంలో ఎంపీడీవో ఎం.భారతి ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. 21 పంట కాలువ పూడికతీత పనులు, రెండు పెద్ద కాలువ పూడికతీత పనులు, రెండు ఫారం పాండ్లు (సేద్యపు నీటి గుంటలు), 14 ఇంకుడు గుంతలు, ఐదు కంపోస్టు పిట్లతో పాటు ఒక గడ్డి పెంపకం పనులు గుర్తించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ- కేవైసీ వెరిఫికేషన్ కచ్చితంగా చేయించుకోవాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ టీఏలు సింహాద్రి, రాజు, ఎఫ్ఏ నరసింహమూర్తి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీతాఫలం.. ధర అధికం

- జోరుగా విక్రయాలు
- చాగల్నాడు ఫలాలకు డిమాండ్
- జాతీయ రహదారి వెంబడి దుకాణాలు



జాతీయ రహదారి వెంబడి ఉన్న సీతాఫలాల దుకాణాలు

రాజానగరం: రుచిలో సిమ్లా ఆపిల్‌ను తలపించే సీతాఫలం ధర ప్రస్తుతం మార్కెట్‌లో కొనుగోలుదారులను హడలెత్తిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతంగా పిలువబడే చాగల్నాడు ఏరియాలో పండే సీతాఫలాలు రుచిలోనే కాదు ఆకారంలో కూడా ఆకట్టుకుంటాయి. నిగనిగలాడుతూ కళ్లు విచ్చుకుని, రెడీ టూ ఈట్ అన్నట్టుగా ఉంటాయి. అందుకనే వీటికి దేశ రాజధాని ఢిల్లీలో సైతం మంచి పేరుంది. రాజకీయ ప్రముఖులతో పని ఉన్న వ్యక్తులు కొందరు వీటిని కానుకగా అందజేయడం ద్వారా వీటికి ఈ ఖ్యాతి లభించింది. దీనితో ప్రస్తుత సీజన్‌లో చాగల్నాడు ప్రాంతం నుంచి మార్కెట్‌కి వచ్చే సీతాఫలాలకు ఎనలేని డిమాండ్ ఏర్పడింది. ఇదే సమయంలో షోలాపూర్ నుంచి దిగుమతి అవుతున్న సీతాఫలాలు కూడా మార్కెట్‌లోకి ప్రవేశించడంతో ఏవీ చాగల్నాడు, ఏవీ షోలాపూర్ ఫలాలో తెలియడం లేదు.

కనుమరుగవుతున్న తోటలు

రియల్ ఎస్టేట్ ప్రభావంతో చాగల్నాడు ప్రాంతంలో ఇతర పండ్ల తోటలతో పాటు సీతాఫలాల తోటలు కూడా కనుమరుగైపోతున్నాయి. సుమారు పది, పదిహేను ఏళ్ల క్రితం వంద ఫలాల ధర రూ.50 నుంచి రూ.వంద మాత్రమే ఉండేది. ఈ ప్రాంతంలో తోటల విస్తీర్ణం తరిగిపోతున్న క్రమంలో సీతాఫలాల ధరలు విపరీతంగా పెరిగాయి. వీటి గురించి తెలిసిన వారు ఇటీవల కాలంలో నేరుగా తోటల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తున్న పరిస్థితులలో మార్కెట్‌కు వచ్చే చాగల్నాడు సీతాఫలాలు చాలా వరకూ తగ్గిపోతున్నాయి. సాధారణంగా చాగల్నాడు సీతాఫలాలు దసరా రోజులలో మార్కెట్‌కు వస్తుంటాయి. ఈ ఏడాది కూడా అదే విధంగా దసరాలో సందడి చేసిన చాగల్నాడు ఫలాలు దిగుబడి తగ్గిపోతూ వచ్చింది. దీనితో వ్యాపారులు షోలాపూర్ నుంచి సీతాఫలాలను



షోలాపూర్ సీతాఫలాలు

దిగుమతి చేసుకుని, చాగల్నాడు ఫలాల పేరుతో సొమ్ములు చేసుకుంటున్నారు.

ధర అధికమే..

ప్రస్తుతం మార్కెట్‌లో సీతాఫలాల ధర సామాన్యులకు అందని విధంగా మారాయి. కాస్త సైజు ఉన్న ఫలాలు డజను రూ. 500 నుంచి రూ.800 పలుకుతున్నాయి. ఈ లెక్కన వంద ఫలాల ధర రూ.4 వేల నుంచి రూ. 6 వేలు ఉంటున్నాయి. ఈ కాయలు కూడా ఒక వారం పాటు ఉంటాయని, ఆపై చాగల్నాడు సీతాఫలాలు దిగుబడే ఉండదంటున్నారు వ్యాపారులు. ఎందుకంటే ఇప్పటికే షోలాపూర్ నుంచి సీతాఫలాలు మార్కెట్‌కు వస్తున్న క్రమంలో వీటి ధర తగ్గడానికి అవకాశం ఉంది. చూడటానికి చాగల్నాడు సీతాఫలాల మాదిరిగా భారీ సైజులో కనిపించే వీటిలో తెల్లటి పురుగులు ఉంటాయనే విషయం చాలామందికి తెలియదు.

కొమ్ము విరిగిన ఆవుకు చికిత్స



బూరుగుపూడిలో ఆవుకు చికిత్స చేస్తున్న వైద్యులు

కోరుకొండ: వాహనం ఢీకొనడంతో కొమ్ము విరిగి రక్తస్రావంతో బాధపడుతున్న జెర్సీ ఆవుకు చికిత్స చేశారు. బూరుగుపూడిలోని పశువుల ఆస్పత్రిలో శనివారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కోరుకొండ మండలం బూరుగుపూడిలోని కంటే సత్యచక్ర గణపతికి చెందిన జెర్సీ ఆవు ఇంటి నుంచి బయటకెళ్లింది. దాన్ని జాతీయ రహదారిపై ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో కొమ్ము విరిగి తీవ్ర రక్తస్రావమైంది. ఈ నేపథ్యంలో ఆవుకు పశువైద్యులు లోకేష్ చికిత్స చేశారు. ఆవు ప్రస్తుతం కోలుకుంటోంది. వైద్యురాలు బత్తిన సుప్రియ మాట్లాడుతూ పశువులకు ఈ తరహా ప్రమాదాలు జరిగితే యజమానులు త్వరితగతిన ఆస్పత్రికి తీసుకురావాలన్నారు.

ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత



కోరుకొండలో ర్యాలీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కోరుకొండ: ప్రకృతిని కాపాడుకుంటే అది ప్రజారోగ్యాన్ని కాపాడుతుందని కోరుకొండ ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన కోరుకొండలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలిని పొందాలంటే మొక్కలు పెంచడంతో పాటు, వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు యువత నడుం బిగించాలన్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వర ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి కె.రమేష్‌బాబు, గ్రామ నాయకులు కర్రి గణేష్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల పరిశీలన



బిక్కవోలులో బాణసంచా షాపును పరిశీలిస్తున్న ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి

బిక్కవోలు: నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అనపర్తి ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన శనివారం బిక్కవోలులోని తాత్కాలిక బాణసంచా దుకాణాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో 17 షాపులకు తాత్కాలిక అనుమతులు ఇచ్చామన్నారు. బిక్కవోలులో ఏడు, బలభద్రపురంలో నాలుగు, కొమరిపాలెంలో ఐదు, తొస్సిపూడి ఒక షాపునకు లైసెన్సు ఇచ్చినట్టు తెలిపారు. ఐదుకంటే ఎక్కువ షాపులు ఉన్నచోట ఫైర్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశామన్నారు.

ఏకగ్రీవంగా పెన్షనర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



అనపర్తిలో ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక శనివారం అనపర్తి పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పీవీఎస్ సూర్యనారాయణ, అధ్యక్షుడిగా కె.సాల్మన్‌రాజు, కార్యదర్శిగా గొలుగూరి రామారెడ్డి, కోశాధికారిగా ఎంవీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా ఎంవీ కృష్ణారెడ్డి, ఎస్‌వీ రామారెడ్డి, చాగంటి సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శులుగా టి.గణపతి రామారెడ్డి, జేవీ సూర్యనారాయణమూర్తి, పి. కిషోర్ కుమార్, డి.నాగేశ్వరరావు, డాక్టర్ ఎం.కృష్ణారెడ్డి, పి.రమేష్ కుమార్, నరాలశెట్టి సుబ్బారావు, కె.అప్పారావు, ఎ.రామారావు, టి.మహాలక్ష్మి, ఎం.కృష్ణవేణిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ శాఖ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎండీ అక్బర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి, కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం



సీతానగరంలో గంధోత్సవం నిర్వహిస్తున్న ముస్లింలు

సీతానగరం: స్థానిక అజీజియా మసీదు సమీపంలోని మహబూబ్ సుభానీ దర్గా వద్ద శనివారం గంధోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఫకీరుల మేళా, తీన్మార్ వాయిద్యాల నడుమ జెండాను, గంధాన్ని గ్రామంలో ఊరేగించారు. కులమత భేదాలు లేకుండా అన్ని మతాల వారూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికులతో పాటు ఇతర మండలాల నుంచీ భారీగా భక్తులు తరలివచ్చారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనకు సుమారు ఐదువేలమంది హాజరయ్యారు. మసీదు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామస్తుల సహాయ, సహకారాలతో ఈ కార్యక్రమం జరిగింది.

దోచుకునేందుకే పీపీపీ మోడల్

- ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం
- కోటి సంతకాల సేకరణకు అపూర్వ స్పందన
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి



లక్ష్మీనరసాపురంలో సంతకం చేస్తున్న గ్రామస్తుడు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: రాష్ట్రంలోని వనరులను దోచుకోవడానికే కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిని తీసుకు వస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం లక్ష్మీనరసాపురం రచ్చబండ, కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సంపద సృష్టిస్తానంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు.. అన్ని రంగాల ప్రైవేటీకరణతో ప్రజలను నట్టేట ముంచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు కనీస అవసరాలైన విద్య, వైద్య రంగాల్లో పీపీపీ అంటూ అన్నింటిని ప్రైవేటు పరం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, దానికి నిరసనగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అనపర్తి మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), గ్రామ సర్పంచ్ దాట్ల కిరణ్ రాజు, ఎంపీటీసీ సభ్యులు సురకాసుల శివ, ఉప సర్పంచ్ శీలం శ్రీనివాసు, పంచాయతీ వార్డు సభ్యులు చిట్టేటి సత్యనారాయణ, చంద్రగిరి వెంకటరమణ, కాటిపాము వెంకటలక్ష్మి, చిట్టేటి గణపతి రామారావు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల ప్రగతిని ఆయా అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జుత్తుగ సూర్యకుమారి, కాకినాడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ రావాడ నాగు తదితరులు పాల్గొన్నారు.

- ప్రతి బాలికకు చదువుతో పాటు బాలికా చట్టాలు, హెల్ప్‌లైన్ నబర్లు 1098, 118, 112పై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బాలికలతో బాలికా దినోత్సవం నిర్వహించారు. అలాగే పెద్దాడ గ్రామంలో రూ.50.70లక్షలతో నిర్మించిన మూడు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు అనంత వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



సీఐ సత్య కిషోర్

కోరుకొండ: బాణసంచా వ్యాపారులు నిబంధనలను తప్పకుండా పాటించాలని కోరుకొండ సీఐ సత్య కిషోర్ అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ దుకాణాల వద్దఇసుక, నీరు తదితర వాటిని సిద్ధంగా ఉంచాలన్నారు. షాపుల మధ్య ఐదు అడుగుల దూరముండాలన్నారు.

వరికోత యంత్రం ప్రారంభం



వరికోత యంత్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

అనపర్తి: పెదపూడి ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్ కొనుగోలు చేసిన నూతన వరికోత యంత్రాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శనివారం అనపర్తిలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మార్ని వెంకట్రావు, సత్తి వెంకటరెడ్డి, పోలిరిపి పండు, మేడిశెట్టి రవి, కరక విజయ్ దుర్గాప్రసాద్, సాంబత్తుల రాధాకృష్ణ, కాకర రాము, కోనా గణేష్, అల్లివిల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

దీపావళికి జాగ్రత్తలు తీసుకోవాలి



రంగంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

రంగంపేట: జాగ్రత్తలు తీసుకుని, అప్రమత్తంగా ఉంటూ వెలుగుల పండగ దీపావళిని సంతోషంగా జరుపుకోవాలని తహసీల్దార్ కోసు అనసూయ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ వీర సాయిబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి వేణుశ్రీ లక్ష్మి, ప్రొబెషనరీ ఎస్ఐ మురళీకృష్ణ తదితరులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు తప్పనిసరిగా పెద్దలు పక్కనే ఉండాలన్నారు. పర్యావరణాన్ని పాడు చేయకుండా ఎకో ఫ్రెండ్లీ దీపావళి జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి, గ్రామ ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, ఏపీఎం నాగశేషవేణి, ఎంఈఓలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరుకొండ: పర్యావరణ పరి రక్షణ కోసం గ్రీన్ దీపావళి నిర్వహించాలంటూ కోరుకొండలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్సై నాగార్జున ఆధ్వర్యంలో ప్రధాన వీధుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.